# బందీ

## -శౌరిజయప్రకాశ్



అయిదు సంవత్సరాల క్రిందటి మాట.

ఆ వూరు పట్టణంలా అభివృద్ధి చెందిన వొక పెద్ద పల్లె. మండల కేంద్రం. ఆ పల్లె పట్టణ వాతావరణం సంతరించుకొన్నా, సనాతన సాంఘిక దురాచారాలతోనూ, పురాతన భావాలతోనూ బూజుపట్టి వుంది. వాటిని పాటించడంలో అగ్ర కులస్థులదే అగ్రస్థానం.

ఆ పల్లెలో ఒకే వొక్క బ్యాంకు శాఖ పనిచేస్తూ వుంది. అగ్ర కులస్థులు ఆ బ్యాంక్ ఆవరణలోనికి నిర్భయంగా, అధికారికంగా ప్రవేశించి తమ లావాదేవీలు జరుపుకొంటూరు. బ్యాంకు సిబ్బంది కూడా వారి యెడల గౌరవ మర్యాదులు చూపిస్తారు.

కానీ... వూరికి దూరంగా నివసిస్తున్న దళితులు మాత్రం ఆ బ్యాంకు భవన ప్రవేశద్వారాన్ని దాటాలంటేనే వొణికిపోయేవారు. ఎవరు పిలువబడితే వారు మాత్రమే లోపలికెళ్లాలి. వెళ్లేముందు కాళ్లకున్న చెప్పలు బయటేవదిలి, తలపాగా విప్పి, రెండు చేతులు జోడించిన భంగిమలో వెళ్లాలి.

అలా అని అందరూ పిలువబడరు.

మేనేజర్ వద్ద కూర్చొన్న అగ్రకుల ప్రముఖులు యెవరికైనా సిఫారసు చేస్తారో వారు మాత్రమే పిలువబడతారు. అట్టివారికే రుణాలు ఇవ్వబడేది. మిగతా వారికి మొండి చెయ్యే.

ప్రభుత్వ పథకాలలో రిజర్వేషన్లు ఇంతవరకూ పాటించబడలేదు ఆ శాఖలో.

కొత్తగా బదిలీమీద వచ్చి ఆ శాఖలో ఆఫీసరుగా బాధ్యతలను స్వీకరించిన నేను అక్కడ నెలకొన్న పరిస్థితి నవగాహన చేసుకొన్నారు. దళితులకు సామాజిక న్యాయం జరగడం లేదక్కడ. వారి హక్కులు హరించబడుతున్నాయి.

కొంత చనువు పెరిగాక మేనేజర్‌గారితో ఆ విషయం గురించి ప్రస్తావించాను. ఆయన నాతో అన్నారు.

"శాస్త్రిగారూ! ఈ వూరి దళితుల గురించి మీకింకా సరిగ్గా తెలిసి రాలేదండి. బ్యాంకులో ఒక రూపాయి డిపాజిట్ చేయలేదు సరికదా, అప్పలు మాత్రం అప్పణంగా కావాలంటూరు. అప్పలు ఇచ్చామే అనుకోండి వాటిని తిరిగి చెల్లించరు. వసూళ్ళకోసం మనం వాళ్ల ఇళ్ల చుట్టూ తిరిగి తిరిగి చావాలి. వారి ఇళ్ల పరిసరాలు శుభ్రంగా వుంటాయంటే అదీ లేదు. పరమ కంపు. ఇళ్ల ముందరనే మల మూత్రాలు విసర్జించి వుంటారు. వాటిని పొరపాటున తొక్కితే వారం రోజులు నిద్ర రాదు. పైగా చర్మాల వాసన. ముక్కు మూసుకునే వెళ్లాలి. ఒక్కరూ దొరికి చావరు. పైఅధికారుల నుండి మనకు చివాట్లు. ఎందుకొచ్చిన గొడవ?..."

నేను కాస్సేపు ఆలోచించి–

"వాళ్లను సరైన రీతిలో ఎడ్యుకేట్ చేస్తే, రుణాలను సద్వినియోగ పర్చుకొనేలా చేస్తే తప్పకుండా తీసుకొన్న రుణాలు వెనక్కి కడతారు. అగ్రకులస్థులెంత మంది తాము తీసుకొన్న రుణాలను సక్రమంగా చెల్లించారు చెప్పండి? 'వారిలోనూ మొండి బాకీలు చాలా వున్నాయి. అటువంటప్పుడు దళితులకేసి మాత్రమే వేలెత్తి చూపడమెందుకు సార్?"

ఆ మాటలకు మేనేజర్ మౌనం వహించారు.

నేనే తిరిగి చెప్పడం ప్రారంభించాను.

"వారికి డిపాజిట్ చేయడానికి డబ్బులెలా వస్తాయి? వారికేం కావాలో, ఏ పని చేయగలరో స్వయంగా తెలుసుకొని సిస్టమ్యాటిక్‌గా రుణాలిస్తే అవి తప్పక సద్వినియోగమౌతాయి. వడ్డీతో సహా సక్రమంగా తిరిగొస్తాయి. అంతేగానీ కొందరు అగ్రకులస్థుల సిఫారసుల మేరకు రుణాలిచ్చామనుకోండి అవి దుర్వినియోగమవుతాయి. లబ్దిదారులకు చేరవు. దాంతో అప్పలు తిరిగిరావు. దళితుల పేర్లమీద అప్పలుంటాయి. డబ్బును సిఫారసు చేసిన వాళ్లు తినేస్తారు. మన రికార్డుల పరంగా ఎవరి పేరుంటే వాళ్లనే అడుగుతాం మనం... ఇంకో విషయం సార్, దళితులు బ్యాంకు గడప అవతలే చెప్పలు విదిలి లోపలికొచ్చే దుష్ట సాంప్రదాయాన్ని మనం ఆపాలి. అందర్నీ సమానంగా 'ట్రీట్' చేయాలి.

మీ కేవిధమైన ఇబ్బందులు లేకుండా నేను గ్రామ ప్రముఖులతో మాట్లాడి నచ్చ చెబుతాను. ఆ బాధ్యత నాకొదిలేయండి" అని మేనేజర్ గారిని వొప్పించాను.

సాటి కులస్థుడనైన నేను నచ్చ చెప్పడంతో గ్రామ ప్రముఖులు అంటే అగ్రకులస్థులు అయిష్టంగానే అంగీకరించారు.

'అధికులూ, అధములూ అన్న భేదాలు మానవులు సృష్టించుకొన్నవే; భగవంతుని దృష్టిలో అందరూ సమానమే.' అన్న తత్వం నాది. తద్విరుద్ధమైనది నా ధర్మపత్ని మనస్తత్వం.

** **·**

ఒక సంవత్సరం గడిచింది.

ఆ వూరి వాతావరణం, నైసర్గిక పరిస్థితులు నాకు నచ్చాయి. బ్యాంకునుంచి అప్పచేసి అక్కడే ఇల్లు కట్టించాను. నా కలల ప్రతిరూపంగా వున్న ఇంటిని చూసుకుని మురిసిపోయాను.

నా మానస సరోవరం అనంత తరంగితమైంది.

ఒక శుభ ముహూర్తాన గృహప్రవేశం జరిపించాను. అందరినీ పేరు పేరునా ఆహ్వానించాను.

దళితులను పిలవడం మరచిపోలేదు.

వారికి సరియైన చేయూత, ఆదరణ, సమాన సాంఘిక హోదా లభిస్తే తప్పక పైకి యెదుగుతారు. అందరూ తప్పకుండా గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై, విందు భోజనం ఆరగించి వెళ్ళాలని మరీ మరీ వొక్కి చెప్పాను. ఒక అగ్ర కులస్థుని చేత సగౌరవంగా అటువంటి కార్యక్రమాలకు అందరితో సమానంగా ఆహ్వానింప బడటం దళితులు తమ జన్మలో యెరిగి వుండరేమో!

బ్యాంకు వ్యవహారాలలో దళితుల యెడ చూపబడుతున్న వివక్షత, అమర్యాద, దూషణల, దుష్ట సాంప్రదాయల సాంద్రతను తగ్గించి, వారు ధైర్యంగా, స్వతంత్రంగా లావాదేవీలు జరుపుకొనేందుకు, స్వయంగా వృద్ధికి దోహదం కల్పించిన



నన్ను వారు జన్మంతా గుర్తుపెట్టుకొంటారు. ఆ కృతజ్ఞతతోనే వారు నా గృహ నిర్మాణంలో వానర సైన్యంలా పనిచేశారు.

వాకు కీర్తికి కీర్తి వచ్చింది.

డబ్బుకు డబ్బూ ఆదా అయింది.

వారిలో అంజనేయులు అనే దళితుడు నా గృహ నిర్మాణంలో నిర్వహించిన పాత్ర అసమానయమైనది. అతను రామభక్త హనుమాన్‌లా నమ్మినబంటు. అప్పుడు ఆ ప్రాంతంలో నీటికి చాలా కటకటగా వుండేది. ఎక్కడి నుంచి తెచ్చేవాడో యేమో? అపర భగీరథునిలా నీటిని డ్రమ్ములతో తన లాడుగు బండిలో తెచ్చేవాడు. ఆ లాగుడు బండిని కొనుక్కోవడానికి నేనే బ్యాంక్ ద్వారా అప్పింపించాను. అని వలల గృహ నిర్మాఒణం నిరాఘాటంగా సాగిపోయింది.

నీరు సరఫరా చేసే పనిని అతనికి గాక ఇతరులకు కొప్పజెప్పివుంటే ఖర్చు మూడింతలై వుండేది. పైగా అతడు రాత్రంతా ఇంటికి కాపలా వుండేవాడు. నేనిచ్చే నెల జీతం నామమాత్రమే ('ఏమైనా నేను బ్యాంకర్ని కదా!) దాన్ని తీసుకోవడాని క్కూడా అతడు తటపటాయించేవాడు. "మీ తావ దుడ్లు తీస్కొంటే ఎట్ల సార్? నేను బదుక్కొనేకి బండి ఇప్పించారు. అది సాలు సార్" అనేవాడు. నేనే బలవంతంగా నెల జీతం ఇచ్చేవాడిని. అతని కాపలాతో ఒక్క పిడికెడు సిమెంట్‌గానీ, వొక్క ఇటుక పెల్లగానీ తేడా రాలేదు. అతని స్థానంలో ఇతరులుండి వుంటే యెంత నష్టం జరిగి వుండేదో!

ఇక దళితులే కూలీలై రాళ్లు మోశారు. తాపీ పని చేశారు. సిమెంట్, ఇటుక వాడకంలో అతి జాగరూకత, నైపుణ్యం చూపారు.

"రేయ్! మన సార్‌కు ఇల్లు 'స్ట్రాంగ్'గా కట్టించాలిరా' అని తమ స్వంత పనిలా భావించి నిర్మాణం పూర్తికావడానికి తమ శక్తియుక్తులు ధారపోశారు. కూలీ డబ్బులెంతితే అంతే తీస్కొనేవారు. నాకు డబ్బు బాగా ఆదా అయింది. బయట అప్పులు చేయనవసరం కలుగలేదు.

దళితులు చేసిన ప్రచ్ఛన్న ఆర్థిక సాయం నా భార్య గాయత్రికి బాగా తెలుసు. వారిని తనకు అనుకూలంగా వుపయోగించుకొంది. వారు కూడా ఆమె చెప్పిన విధంగానే పనిచేశారు.

మాదిగ గేరి (దళితవాడ) పెద్దకు అందర్నీ విందు భోజనానికి పిల్చుకొని వచ్చే బాధ్యత అప్పగించాను.

కొత్త ఇంటి ముందు వేయబడి వున్న షామియానా క్రింద ఆహుతులందరూ కుర్చీలలో ఆసీనులై వున్నారు.

దళితులు మాత్రం షామియానా బయట యెండలో నిలుచున్నారు. వారి ముఖాలు వాడిపోయి వున్నాయి. ఆ ముఖాలలో ఆకలి స్పష్టంగా కనిపిస్తూ వుంది.

సత్యనారాయణ వ్రతం ముగిసింది.

మెడ వొంగి పోయేలా నగలు, వొడలు జిగేల్ మనిపించేలా వున్న ఖరీదైన ధర్మవరం పట్టు జరీ చీర ధరించిన నా ధర్మపత్ని ప్రసాదం వుండల పాత్రతో బయటకొచ్చింది.

కూర్చున్న ఆహుతుల దగ్గరకెళ్లి ప్రసాదవు వుండలు పంచిపెట్టింది. బయట యెండలో నిలుచున్న దళితుల పక్క వోరకంటితో చూసి వెనుదిరిగి వచ్చేసింది.

సింహద్వారం ముందున్న ఎత్తైన సిమెంట్ సిట వుట్‌మీద నిలుచుకొని 'ప్రసాదం తీసుకొందురు రండ'ని దళితులనుద్దేశించి పిలిచింది. వాళ్లు రాలేదామె దగ్గరకు.

"దగ్గర కొచ్చినవ్వడివ్వకుండా దూరంగా వెళ్లి పిలుస్తావుండావా తల్లీ? మేమంత తక్కువైనామా? మేం రాము. నువ్వేరా" అని అంజనేయులు గట్టిగా అరిచి బదులిచ్చాడు. దాంతో నా భార్యకు అరికాలి మంట నెత్తికెక్కింది. నిరసనగా, అహస్యంగా వొకసారి వారివైపు చూసి రుసరుస లాడుతూ ప్రసాదం ఇవ్వకుండానే లోపలికెళ్లిపోయింది.

సూర్యుడు నడినెత్తిమీద కొచ్చాడు.

భోజనాలు మొదలయ్యాయి.

నూతన గృహం లోపల టేబుళ్లమీద అరిటాకులలో భోజనాలు వడ్డించబడున్నాయి. మూడు స్వీట్లు, అయిదారు రకాల ఆహార పదార్థాలూ వడ్డన చేయబడివున్నాయి.

ఆహ్వానితులు దర్జాగా భోంచేస్తున్నారు.

బ్యాచెస్ ప్రకారం జరుగుతున్నాయి భోజనాలు.

ఆహుతులింకా వస్తూనే వున్నారు. విచ్చేసిన ప్రముఖులకు ఆలస్యం జరుగకుండా భోజనాలు వడ్డించబడుతున్నాయి. తాంబూలాదులు అందజేయబడుతున్నాయి. వీడికోళ్లు, సాగనంపడాలూ మర్యాదలూ జరిగిపోతున్నాయి.

దళితులు ఎండలో నిలుచుకొని పిలుపుకోసం ఎదురుచూస్తున్నారు. వారి ముఖాలలో ఆకలి కొట్టొచ్చినట్లు కనిపిస్తూ వుంది.

ప్రముఖులందరి భోజనాలు ముగిసినట్టే.

ఇక దళితులు మిగిలారు.

"గాయత్రీ! వాళ్లంతా ఆకలితో ఎండలో చాలా సేపటి నుండీ వేచి వున్నారు. త్వరగా టేబుళ్లు క్లీన్ చేయించు. వారంత భోంచేస్తారు. ఇప్పటికే ఆలస్యమైంది. వూ! త్వరగా" అని ఆర్డర్స్ పాస్ చేశాను నా భార్యకు. ఆమెలో స్పందన లేదు.

"నీకే చెబుతావుంది" అని రెచ్చించాను.

నా భార్య అప్పుడు మాట్లాడింది. ఆమె కంఠంలో నిరశన భావం.

"మీకేమైనా మతిపోయిందాండీ! మాలా మాదిగలు ఇంట్లోకొచ్చి భోంచేయడమేమిటండీ! ఎక్కడుండే వాళ్లు అక్కడుంటేనే మంచిది. చెప్పులు కాళ్లకేసుకుంటాము గానీ తలమీద పెట్టుకొంటామా? రేపు సాటి కులస్థుల ముందు తలెత్తుకు తిరగ్గలమా? పైగా సత్యనారాయణ వ్రతం చేయించాము. వాళ్లు లోపల అడుగుపెడితే మైల అంటుకుంటుంది.

అభ్యుదయ భావాలనీ, ఆవకాయలనీ మీరే వాళ్లను నెత్తికెక్కించుకొన్నారు. మీ సిద్ధాంతాలు బ్యాంకు వరకే పరిమితం చేయండి కానీ ఇంటి దాకా తీసుకురాకండి. మీ కంతగా కావాలనుకుంటే బయటే భోజనాలు పెట్టించండి. అంతేగానీ వాళ్లు ఇంటి లోపలకు రావడానికి వీల్లేదు" అని నా భార్య గుడ్లురుముతూ నాకేసి చూస్తూ మాట్లాడుతుంటే నేను అవాక్కయి పోయాను. మాటా మాటా పెరిగితే అల్లరవుతుంది. అందరి ముందు పరువు పోతుందనుకొని అప్పటికి మౌనం వహించాను.

సాంప్రదాయ కుటుంబ చట్రంలో బందీనైపోయాను.

అల్లకల్లోలమైన మనస్సుతో బయటికొచ్చాను.

ఇల్లు కట్టడానికుపయోగించిన ప్రతి ఇటుకా, ప్రతి రాయీ దళితులచే స్పర్శించబడింది. నిజం చెప్పాలంటే వారి చేమటనే నీళ్లుగా మార్చి ఆ ఇంటిని నిర్మించారు. కానీ వారు కట్టిన ఇంటిలోకి వారికే ప్రవేశం లేకుండా పోయింది అని బాధపడుతూ, షామియానా క్రింద భోజనాలు యేర్పాటు చేయాలని కుర్చీలు పక్కకు తీసి, నేలమీద చాపలు పరిచాను. ఒక మూల టేబుల్‌వేసి ఆహార పదార్థాలను వంటవాళ్లచే తెప్పించి టేబుల్‌పై పెట్టించాను. వడ్డించడానికి వంటవాళ్లు సిద్ధంగా వున్నారు. 'భోజనాలు చేస్తురు రండి' అని దళితులను పిలుద్దామని వెనక్కితిరిగి చూశాను.

ఆశ్చర్యం! ఒక్కరూ లేరక్కడ.

దూరంగా అంజనేయులు మిగతా వారందరికీ యేదో చెబుతున్నాడు.

ఒక వేడి నిట్టూర్పు విడిచాను నేను.